AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH, TRUST, TREND
WWW.AKSHARATODAYNEWS.COM
29-7-2026 (Wednesday)
MAIN EDITION

## ఎక్స్ ఖాతాదారులకు నోటీసులు




**అక్షరటుడే, ఢిల్లీ :** దేశ రాజధానిలో విద్యార్థుల నిరసనల వేళ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీతో పాటు భద్రతా దళాలను లక్ష్యంగా చేసుకుని సోషల్ మీడియాలో అభ్యంతరకర పోస్టులు పెట్టిన ఎక్స్ (ట్విట్టర్) ఖాతాదారులకు ఢిల్లీ పోలీసులు నోటీసులు జారీ చేశారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా, చట్టాలను ఉల్లంఘించే విధంగా సామాజిక మాధ్యమాలలో వైరల్ అవుతున్న పోస్టులపై పోలీసులు ప్రత్యేక నిఘా పెట్టారు. వాటిని క్షుణ్ణంగా సమీక్షించిన తర్వాతే ఈ చట్టపరమైన చర్యలు ప్రారంభించారు.

## కోల్ స్కామ్ కేసు.. మాజీ ప్రధానికి క్లీన్‌చిట్



**అక్షరటుడే, ఢిల్లీ :** యూపీఏ హయాంలో జరిగిన బొగ్గు కుంభకోణంలో మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్‌పై కేసును సుప్రీంకోర్టు మూసివేసింది. తలాబిరా II బొగ్గు బ్లాక్ కేటాయింపుల కేసులో భారత మాజీ ప్రధాని దివంగత డాక్టర్ మన్మోహన్ సింగ్ , మరో ఐదుగురిని నిందితులుగా పిలిపించాలని కోరుతూ ప్రత్యేక సీబీఐ కోర్టు 2015లో ఇచ్చిన ఉత్తర్వును కొట్టివేసింది. అప్పీళ్లను అనుమతిస్తూ, సీబీఐ (సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్) ముగింపు నివేదికలను కోర్టు అంగీకరించింది.

### లిస్టింగ్ సూపర్ హిట్..

**అక్షరటుడే, బిజినెస్ డెస్క్:** భాశ్రీ బాలాజీ మాలా టెక్స్‌టైల్స్ .. బీఎస్ఈ ఎస్ఎంఈ సెగ్మెంట్‌లో ఐపీవోకు వచ్చింది. కంపెనీ షేర్లు బుధవారం లిస్ట్ అయ్యాయి. 90 శాతం ప్రీమియంతో షేర్లు లిస్ట్ కాగా.. క్షణాల్లోనే లాభాల స్వీకరణతో షేరు ధర 5 శాతం తగ్గి 126.35 వద్ద లోయర్ సర్క్యూట్‌ను తాకింది.



### దంచికొడుతున్న వానలు..

**అక్షరటుడే, హైదరాబాద్ :** అల్పపీడన ప్రభావంతో తెలంగాణ వ్యాప్తంగా నాలుగు రోజులుగా విస్తారంగా వర్షా లు కురుస్తున్నాయి. బుధ, గురువారాల్లో సైతం భారీ నుంచి అతి భారీ వర్షా లు కురుస్తాయని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.




### మ్యాన్‌హోల్‌లో పడి వృద్ధుడి గల్లంతు

**అక్షరటుడే, హైదరాబాద్ :** హైదరాబాద్ నగరంలో విషాదం చోటు చేసుకుంది. తెరిచి ఉన్న మ్యాన్‌హోల్‌లో పడి ఓ వృద్ధుడు గల్లంతు అయ్యాడు. నగరంలో మంగళవారం రాత్రి భారీ వర్షం కురిసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో మియాపూర్‌లో తెరిచి ఉన్న మ్యాన్‌హోల్ ఓ వృద్ధుడు గల్లంతు అయ్యాడు.



# రాహుల్ వ్యాఖ్యల దుమారం

లోక్‌సభలో విపక్ష నేత, కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారానికి దారితీశాయి. పబ్లిక్ ఎగ్జామినేషన్స్‌లో అక్రమాల నిరోధక బిల్లుపై బుధవారం జరిగిన చర్చ సందర్భంగా ఆయన కేంద్ర ప్రభుత్వం, ఆర్‌ఎస్‌ఎస్, హోంమంత్రి అమిత్ షాపై విమర్శలు గుప్పించారు. విద్యార్థుల ఆందోళనలను ప్రస్తావిస్తూ ఆయన చేసిన వ్యాఖ్యలపై అధికార బీజేపీ సభ్యులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. - అక్షరటుడే, నేషనల్ డెస్క్



- అమిత్ షాపై తీవ్ర ఆరోపణలు
- బీజేపీ సభ్యుల ఆగ్రహం
- రికార్డుల నుంచి తొలగించిన స్పీకర్
- యాంటీ పేపర్ లీక్ బిల్లుకు ఆమోదం

పేపర్ లీక్ ఘటనలతో ఎన్నో ఆశలున్న యువత తీవ్ర ఆందోళనకు గురైందని, ఢిల్లీలో శాంతియుతంగా నిరసన తెలుపుతున్న వారిపై పోలీసులు రెచ్చగొట్టేలా ప్రవర్తించారని రాహుల్ గాంధీ ఆరోపించారు. ఆందోళన చేస్తున్న విద్యార్థులను తాను కలిశానని, ప్రభుత్వంలో ఉన్నవారు తమ ఆవేదన పట్టించుకోవడం లేదని వారు వాపోయారని పేర్కొన్నారు. దేశంలో విద్యావ్యవస్థ క్రూరంగా మారిందని, ప్రైవేటీకరణ విచ్చలవిడిగా జరుగుతోందని రాహుల్ మండిపడ్డారు. కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ కేవలం సింబల్ మాత్రమేనని, అసలైన విద్యావ్యవస్థను ఆర్‌ఎస్‌ఎస్ నడిపిస్తోందని ఆరోపించారు. వర్సిటీల్లోనూ ఆర్‌ఎస్‌ఎస్ నేపథ్యం ఉన్నవారినే వీసీలుగా నియమిస్తున్నారని విమర్శించారు. అంతేగాకుండా మూర్ఖులు ఎవరి మాట వినరని విద్యార్థులు తనతో అన్నారని ఆయన సభలో ప్రస్తావించారు. ఈ వ్యాఖ్యలపై బీజేపీ సభ్యులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

### అమిత్ షాపై ఆరోపణలు..

విద్యార్థులపై పెల్లెట్ గన్స్ ఎందుకు ప్రయోగించారని ప్రశ్నించిన రాహుల్.. ఆందోళనకారులను అణచివేయాలని కేంద్ర హోంమంత్రి అమిత్ షానే ఆదేశించారని ఆరోపించారు. సభకు వచ్చే ధైర్యం హోంమంత్రికి లేదంటూ విమర్శలు గుప్పించారు. రాహుల్ ప్రసంగం సమయంలో ఆయన ఉపయోగించిన కొన్ని పదాలపై బీజేపీ ఎంపీలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థుల పేరు చెప్పి సభను, ఎంపీలను అవమానిస్తున్నారని మండిపడ్డారు. రాహుల్ చేసిన ఆరోపణలపై కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు స్పందిస్తూ.. అమిత్ షా పేరును ప్రస్తావించడానికి రాహుల్ వద్ద ఎలాంటి ఆధారాలున్నాయని నిలదీశారు. ఆయన వెంటనే తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని హోంమంత్రికి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ వివాదంపై సభలో వాడీవేడి వాగ్వాదం జరగగా, వివాదాస్పదమైన కొన్ని వ్యాఖ్యలను స్పీకర్ రికార్డుల నుంచి తొలగించారు.

### బిల్లుకు ఆమోదం


సుదీర్ఘ చర్చ అనంతరం యాంటీ పేపర్ లీక్ నవరణ బిల్లుకు లోక్‌సభ ఆమోదం తెలిపింది. విపక్ష సభ్యులు బిల్లుకు సవరణలు ప్రతిపాదించారు. అయితే అవి వీగిపోయాయి. దీంతో మూజువాణి ఓటుతో సభ బిల్లుకు ఆమోదం తెలిపింది.

### వణుకుతూ కనిపించారు

హోం మంత్రి అమిత్ షా సభలో వచ్చి కూర్చునే ధైర్యం లేకపోవడం చూసి తనకు సంతోషంగా ఉందన్నారు. ఆయన తన కారులో వణుకుతూ కూర్చున్నారని పేర్కొన్నారు. భయపడుతుండటంతో ఆయన సభకు రాలేదన్నారు. విద్యార్థులపై లాఠీచార్జి ఆయనే చేయించారన్నారు.

## నౌకలపై దాడులను ఖండించిన భారత్

**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** పశ్చిమ ఆసియాలో ఉద్రిక్తతలు పెరగడాన్ని 'తీవ్ర ఆందోళనకరం'గా అభివర్ణిస్తూ, హర్మూజ్ జలసంధిలో పలు సముద్ర నౌకలపై ఇటీవల జరిగిన దాడులను భారతదేశం తీవ్రంగా ఖండించింది. ఆ ప్రాంతంలోని అంతర్జాతీయ జలమార్గాల ద్వారా నిరాటంకమైన నౌకాయానం, వాణిజ్యాన్ని పునరుద్ధరించాలని సూచించింది. పశ్చిమ ఆసియా భారత్‌కు అత్యంత ప్రాముఖ్యత కలిగిన ప్రాంతమని ఐక్యరాజ్య సమితిలో భారత శాశ్వత ప్రతినిధి, రాయబారి పార్వతనేని హరీష్ అన్నారు. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు పెరగడంపై ఆందోళన వ్యక్తం చేశారు. ఉద్రిక్తతలను తక్షణమే తగ్గించాలని సూచించారు.



## రోబోట్ల దిగుమతులపై అమెరికా నిషేధం

**అక్షరటుడే, నేషనల్ డెస్క్ :** అమెరికా, చైనాల మధ్య సాంకేతిక రంగంలో ఆధిపత్య పోరు మరో కీలక దశకు చేరింది. ఇప్పటికే సెమికండక్టర్లు, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, 5జీ నెట్‌వర్కింగ్ రంగాలపై ఆంక్షలు విధించిన అమెరికా.. తాజాగా చైనాకు చెందిన 'హ్యూమనాయిడ్ రోబోట్లు' దిగుమతులపై పూర్తిగా నిషేధం విధించింది. జాతీయ భద్రత, డేటా గోప్యత, సైబర్ భద్రతా ముప్పులను కారణంగా చూపుతూ ఫెడరల్ కమ్యూనికేషన్స్ కమిషన్ ఈ సంచలన నిర్ణయాన్ని ప్రకటించింది.

## సీపీఎం నేతలపై జేపీ నడ్డా ఆగ్రహం



**అక్షరటుడే, న్యూ ఢిల్లీ:** సీపీఎం నేతలపై కేంద్ర మంత్రి జేపీ నడ్డా బుధవారం ఆగ్రహం వ్యక్తం చేశారు. ఢిల్లీలోని కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియా (మార్క్సిస్ట్) కార్యాలయంపై మంగళవారం పోలీసులు జరిపిన దాడిని 'సాధారణ శాంతిభద్రతల పరిస్థితి'గా ఆయన అభివర్ణించారు. ఈ పోలీసు చర్యను రాజకీయం చేస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజ్యసభలో బుధవారం పార్టీ కార్యాలయంపై జరిగిన పోలీసుల దాడి అంశాన్ని సీపీఎం రాజ్యసభ ఎంపీ జాన్ బ్రిట్టాస్ ప్రస్తావించారు. పాత కేసులో ఎస్ఎఫ్ఐ ఢిల్లీ కార్యదర్శి ఐషే ఘోష్‌ను అరెస్ట్ చేసేందుకు పోలీసులు యత్నించారు. ఇది చాలా సాధారణ శాంతిభద్రతల పరిస్థితి అని జేపీ నడ్డా పేర్కొన్నారు. క్రియాశీలతలో ఉన్న ఏ విద్యార్థి నాయకులు అయినా ఇలాంటి పరిస్థితిని ఎదుర్కోవలసి వస్తుందన్నారు.

## ఎస్పీ ఎంపీల నిరసన





**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** అయోధ్య రామ మందిరంలో విరాళాల చోరీపై సమాజ్‌వాది పార్టీ ఎంపీలు నిరసన తెలిపారు. పార్లమెంట్ ఆవరణలో బుధవారం ఉదయం కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. 'చందా చోర్ గడ్డి ఛోడ్' (డబ్బు దొంగ, గద్దెను వదిలేయండి) అనే నినాదాలు చేస్తూ ఎస్పీ ఎంపీలు నిరసన తెలిపారు. సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేష్ యాదవ్ మాట్లాడుతూ.. విరాళాలను కాపాడటంలో విఫలమై, భక్తిశ్రద్ధలతో సమర్పించిన కానుకలను రక్షించలేని వారు, పేపర్ లీక్‌లను నివారిస్తారని లేదా పరీక్షలు రద్దు కాకుండా చూస్తారని ఎలా ఆశించగలం అన్నారు.

## మహిళపై వేధింపులు.. సీఐ సస్పెండ్

**అక్షరటుడే, జూబ్లీహిల్స్:** జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌లో సీఐగా విధులు నిర్వహిస్తున్న శ్రీనివాసులు రెడ్డిని సీపీ సజ్జనార్ మంగళవారం సాయంత్రం సస్పెండ్ చేశారు. కుటుంబ సమస్యలపై ఫిర్యాదు చేసేందుకు వచ్చిన మహిళను ఆయన మాయమాటలు చెప్పి, పెళ్లి చేసుకుంటానని నమ్మించాడు. సహజీవనం చేసి గర్భం దాల్చిన తరువాత బెదిరించి అబార్షన్ చేయించాడు. రహస్యంగా చిత్రీకరించిన ప్రైవేట్ వీడియోలను చూపించి బ్లాక్మెయిల్ చేసి రూ.2 కోట్ల వరకు ఆమె నుంచి వసూలు చేశాడు. దీంతో బాధితురాలు డీజీపీ సీవీ ఆనంద్‌కు ఫిర్యాదు చేశారు. విచారణ చేపట్టిన ఉన్నతాధికారులు సీఐని సస్పెండ్ చేశారు.



## యూపీఐ యాప్స్‌లో దూసుకెళ్తున్న 'భీమ్'




**అక్షరటుడే, బిజినెస్ డెస్క్ :** భారత్‌లో యూపీఐ ద్వారా చెల్లింపులు రికార్డులు సృష్టిస్తున్న విషయం తెలిసిందే.. ఇందులో విదేశీ యాప్‌లదే మెజారిటీ వాటా ఉన్నా.. దేశీ యాప్ 'భీమ్' సైతం పోటీలో నేనున్నానంటోంది. ఈ ప్లాట్‌ఫామ్ ద్వారా నెలవారీ యూపీఐ లావాదేవీలు రెండేళ్లలో దాదాపు పది రెట్లు పెరిగాయి. గతనెలలో రూ. 25,613 కోట్ల విలువైన 224 మిలియన్ల యూపీఐ లావాదేవీలను ప్రాసెస్ చేయడం గమనార్హం. భీమ్ యూపీఐ లావాదేవీలు రెండేళ్లలో గణనీయంగా పెరిగాయి. అయితే దేశంలో మొత్తం యూపీఐ మార్కెట్‌లో ప్రస్తుతం భీమ్ వాటా కేవలం ఒక్క శాతంగానే ఉంది.

## నౌకలపై దాడులను ఖండించిన భారత్

**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** పశ్చిమ ఆసియాలో ఉద్రిక్తతలు పెరగడాన్ని 'తీవ్ర ఆందోళనకరం'గా అభివర్ణిస్తూ, హర్మూజ్ జలసంధిలో పలు సముద్ర నౌకలపై ఇటీవల జరిగిన దాడులను భారతదేశం తీవ్రంగా ఖండించింది. ఆ ప్రాంతంలోని అంతర్జాతీయ జలమార్గాల ద్వారా నిరాటంకమైన నౌకాయానం, వాణిజ్యాన్ని పునరుద్ధరించాలని సూచించింది. పశ్చిమ ఆసియా భారత్‌కు అత్యంత ప్రాముఖ్యత కలిగిన ప్రాంతమని ఐక్యరాజ్యసమితిలో భారత శాశ్వత ప్రతినిధి, రాయబారి పార్వతనేని హరీష్ అన్నారు. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు పెరగడంపై ఆందోళన వ్యక్తం చేశారు. ఉద్రిక్తతలను తక్షణమే తగ్గించాలని సూచించారు.





## కృష్ణానదికి భారీగా వరద

**అక్షరటుడే, మహబూబ్‌నగర్ :** కృష్ణానదికి వరద కొనసాగుతోంది. ఎగువన మహారాష్ట్ర, కర్ణాటకలో కురుస్తున్న వర్షాలతో వరద పోటెత్తింది. దీంతో నదిపై గల జలాశయాలు కళకళలాడుతున్నాయి. కర్ణాటకలోని ఆల్మట్టి జలాశయం పూర్తిస్థాయి నీటిమట్టం 123 టీఎంసీలు కాగా ప్రస్తుతం 118.2 టీఎంసీల నీరు నిల్వ ఉంది. 68 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా.. దిగువకు 64 వేల క్యూసెక్కులు వదులుతున్నారు. నారాయణపుర్ నుంచి దిగువకు 90 వేల క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. దీంతో జూరాల ప్రాజెక్ట్‌కు వరద కొనసాగుతోంది. ఇప్పటికే ప్రాజెక్ట్ నిండటంతో విద్యుత్ ఉత్పత్తి ద్వారా, గేట్లు ఎత్తి శ్రీశైలం జలాశయానికి నీటిని వదులుతున్నారు.